క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు రూరల్: వివిధ ప్రాంతాల్లోని సబ్‌స్టేషన్ల ఫీడర్‌లలో మరమ్మతు పనుల కారణంగా ఈనెల 31న పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జి.మాడుగుల మండలం సొలభం 11 కేవీ ఫీడర్ పరిధిలో గడుతూరు, వంతల, పెదలోచలి గ్రామాలతో పాటు హుకుంపేట మండలం మట్టం ఫీడర్ పరిధిలోని శోభకోట, మట్టం, గంపరాయి, కోడపల్లి, కిముడుపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మత్స్యగుండం జాతర ఉత్సవ కమిటీ ఎన్నిక



ఎన్నికైన ఉత్సవ కమిటీ సభ్యులు

హుకుంపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం, ఆధ్యాత్మిక కేంద్రం మత్స్యగుండంలో వచ్చే నెలలో నిర్వహించనున్న మహాశివరాత్రి జాతరకు ఉత్సవ కమిటీ ఎన్నిక బుధవారం జరిగినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు తమర్బ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్‌గా మఠం సర్పంచ్ శాంతకుమారి, అధ్యక్షుడిగా గోపాలపాత్రుడు, ప్రధాన కార్యదర్శిగా మత్స్య కొండబాబు, కోశాధికారిగా హరినాథ్, ఉపాధ్యక్షుడిగా ఈశ్వరరావు, సభ్యులుగా ఈశ్వరనాయుడు, బాలయ్య, ఆనంద్, వాసు దేవ్, సింహాచలం నాయుడు, భీమ్‌బాబు, రాంబాబు నాయుడు, రమేష్ నాయుడులను ఎన్నుకున్నట్టు తెలిపారు.

డీలర్ల నియామకం

రాజవొమ్మంగి: రేషన్ దుకాణం డీలర్ల కోసం జరిగిన రాత పరీక్షలో మండలానికి చెందిన 9 మంది అర్హత సాధించినట్టు తహసీల్దార్ అల్లు సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా చీడిపాలెం డిపోకు ఎం.శివరామకృష్ణ, చిన్నయ్యపాలెంకు కె.మల్లేశ్వరి, గొబ్బిలమడుగుకు సీహెచ్.లోవభవాని, కరుదేవపాలెంకు ఎం.వెంకటలక్ష్మి, కె.మర్రిపాలెంకు కె.బాలకృష్ణ, కె.వెలగలపాలెంకు ఎం.లోవరాజు, నెల్లిమెట్లకాలనీకు పి.దేవి, రాజవొమ్మంగి-2కు ఎస్.శ్రీను, తంటికొండ గ్రామంలోని డిపోకు ఎం.భరత్‌కుమార్‌లను నియమించామన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

గంగవరం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఫిబ్రవరి 27న జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలు లో ఉంటుందని అసిస్టెంట్ ఎన్నికల అధికారి, తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నియమ, నింబంధనలు అందరూ పాటించాలని సూచించారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రామకృష్ణ

ముంచంగిపుట్టు: మండలంలోని రంగబయలు పంచాయతీ కేంద్రంలో ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బందితో కలిసి బుధవారం పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మావోయిస్టు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, సారా వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

మార్చి 3, 4 తేదీల్లో గంగమ్మ తల్లి ఉత్సవాలు



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట మత్స్యగెడ్డ వద్ద కొలువై ఉన్న గంగమ్మతల్లి ఉత్సవాలు మార్చి 3, 4వ తేదీల్లో నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.శంకర్‌రావు, సర్పంచ్ రమేష్‌లు తెలిపారు. ఆలయం వద్ద ఉత్సవ నిర్వహణపై కమిటీ సభ్యులు బుధవారం సమావేశం నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణపై చర్చలు జరిపారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు నానిబాబు, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

నత్త నడకన పనులు



అసంపూర్తిగా ఏకలవ్య పాఠశాల భవనాలు



ప్రారంభానికి నోచుకోని ఏకలవ్య పాఠశాల భవనం

ఏళ్లతరబడి సాగుతున్న వైనం

విద్యార్థులకు తప్పని అవస్థలు

పట్టించుకోని అధికారులు

ముంచంగిపుట్టు: ఏళ్లు గడుస్తున్నా ఏకలవ్య పాఠశాల భవనం పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం.. విద్యార్థుల పాలిట శాపంగా మారింది. నిధులు మంజూరైనా భవనం పనులు పూర్తికాకపోవడంతో వేరే మండలంలోని పాఠశాలలో తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. అక్కడ కనీస సదుపాయాలు లేక విద్యార్థులు అల్లాడిపోతున్నారు. అధికారుల అలసత్వం వల్ల తమ పిల్లలు పడుతున్న ఇబ్బందులపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఐదేళ్లయినా అసంపూర్తిగానే..

లబ్బూరులో ఏకలవ్య గురుకుల విద్యాలయ భవన నిర్మాణ పనులు ఏళ్ల గడుస్తున్నప్పటికీ సాగుతూనే ఉన్నాయి. భవనానికి శంకుస్థాపన చేసి అయిదేళ్ల అయినా నేటి పనులు జరుగుతూనే ఉండడం గమనార్హం. ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు గ్రామ సమీపంలో 2020, జనవరి 8న ఎస్‌సీఏ, టీఎస్‌సీ నిధులు రూ.12కోట్లతో ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయ భవనానికి అప్పటి వైఎస్సార్‌సీపీ అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శంకుస్థాపన చేశారు. కొద్ది రోజుల వరకు వేగంగా జరిగిన పనులు ఒక్కసారిగా నిలిచిపోయాయి. అప్పటి నుంచి నేటి వరకు పనులు జరుగుతూనే ఉండడం కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. దీని తరువాత మొదలు పెట్టిన పెదబయలు ఏకలవ్య పాఠశాల పూర్తయి ప్రారంభించడం గమనార్హం. కానీ లబ్బూరు ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణ పనులు నేటికీ నత్తనడకన జరుగుతున్నాయి. ఈ పాఠశాల పనులను పలుమార్లు కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలు పరిశీలించడం, అనంతరం అధికారులు మాట్లాడుతూ నెల రోజుల్లోనే పూర్తవుతాయని ప్రకటిస్తూనే వస్తున్నారు. ఇలా అయిదేళ్లుగా ప్రకటనలు చేస్తూనే కాలక్షేపం చేస్తున్నారని పలువురు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. భవనంలో ప్లంబింగ్, వైరింగ్, పెయింటింగ్ పనులతో పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాల్సి ఉంది.



లబ్బూరులో పూర్తికాని ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయం ఇదే

పెదబయలు వైటీసీలో తరగతులు

ముంచంగిపుట్టు మండలంలోని లబ్బూరు ఏకలవ్య పాఠశాల నిర్వహణ పెదబయలు మండల కేంద్రంలోని వైటీసీలో జరుగుతుంది. ముంచంగిపుట్టులో తరగతుల నిర్వహణకు భవనం లేక పెదబయలులో నిర్వహిస్తున్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 466 మంది చదువుతున్నారు.

వెంటాడుతున్న సమస్యలు

ప్రస్తుత్తం పాఠశాలలో తాగునీటి సమస్యతో గత కొన్ని రోజులుగా విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దూర ప్రాంతం నుంచి పెద్ద పెద్ద డ్రమ్ములతో రోజూ నీరు తీసుకొని రావాల్సి వస్తోందని, వసతి సమస్య వేధిస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు సరిపడ గదులు లేవని, ఆట స్థలం కోసం సైతం ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే లబ్బూరు ఏకలవ్య పాఠశాల ప్రారంభానికి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



2020లో ఏర్పాటు చేసిన శంకుస్థాపన శిలాఫలకం

సమస్యలతో సతమతం

లబ్బూరు ఏకలవ్య పాఠశాలను వెంటనే ప్రారంభించాలి. కొన్నేళ్లుగా పనులు సాగుతూనే ఉన్నాయి. ముంచంగిపుట్టుకు చెందిన ఏకలవ్య పాఠశాల తరగతులను పెదబయలులో కొనసాగిస్తున్నారు. అక్కడ సమస్యలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. తాగునీరు లేక సుదూరం నుంచి తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థుల పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా లబ్బూరు ఏకలవ్య పాఠశాల పనులు వేగంగా చేపడితే విద్యార్థుల కష్టాలు తీరుతాయి.

– పి.సత్యనారాయణ, వైస్ ఎంపీపీ, ముంచంగిపుట్టు

త్వరగా పూర్తి చేస్తాం

లబ్బూరు ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం పెయింటింగ్ పనులు జరుగుతున్నాయి. అత్యంత ఆధునిక స్థాయిలో భవనాలు నిర్మించడం జరిగింది. విద్యార్థులకు అన్నిరకాల సౌకర్యాలు ఉన్నాయి. కొద్ది రోజుల్లో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నాం. త్వరలోనే తేదీని ప్రకటిస్తాం.

– రాముడు, ఏఈ, గిరిజన సంక్షేమ శాఖ, ముంచంగిపుట్టు

పాఠశాలల్లో తనిఖీలు



విద్యార్థులతో మాట్లాడుతున్న బృందం సభ్యుడు

అడ్డతీగల: మండలంలోని నాలుగు పాఠశాలలను సమగ్ర శిక్ష సామాజిక తనిఖీ బృందం బుధవారం తనిఖీలు నిర్వహించింది. అధికారులు జి.సతీష్, సీహెచ్.రాజు, పి.ప్రసాద్ తదితరులు అడ్డతీగలలోని గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు బోధన, మెనూ అమలు, మౌలిక వసతులు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, స్కూల్ గ్రాంట్లు విడుదల వంటి అంశాలపై ఆరా తీశారు. రికార్డులు తనిఖీ చేశారు. ధాన్యంపాలెం ఆశ్రమ పాఠశాల, గొంటువానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారు పర్యటించనున్నట్టు తెలిసింది.

పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు

అరకులోయటౌన్: పారాలీగల్ వలంటీర్లుగా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంఘం అధ్యక్షులు జి.స్వర్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేది సాయంత్రంలోగా అరకులోయ కోర్టులోని న్యాయ సేవాధికార సంఘం డెస్క్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువపత్రాల జెరాక్స్ కాపీలతో పాటు పాస్‌పోర్టు సైజు, స్టాంప్ సైజ్ ఫోటో జతచేయాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఎటువంటి జీతభత్యాలు, పారితోషకం ఉండదన్నారు. శిక్షణ తరగతుల అనంతరం పారా లీగల్ వలంటీర్లుగా ఏడాది పాటు కొనసాగుతారని పేర్కొన్నారు.

గిరిజన చట్టాలు ఉల్లంఘిస్తే సహించేది లేదు



చింతపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్య పడాల్

చింతపల్లి/గూడెం కొత్తవీధి/మారేడుమిల్లి/ఎటపాక: ఏజెన్సీలో గిరిజన చట్టాలను ఉల్లంఘించినట్టు ఏ ఒక్కరూ మాట్లాడినా సహించేది లేదని జిల్లాలోని చింతపల్లిలో ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్యపడాల్, జీకే వీధిలో సీపీఎం నాయకుడు జి.సత్యనారాయణ, మారేడుమిల్లిలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు, గిరిజన సంఘం నాయకుడు గొర్లె అనిల్ ప్రసాద్(బాబి), ఎటపాకలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కుంజా శ్రీను తదితరులు డిమాండ్ చేశారు. ఆయా మండలాల్లో బుధవారం వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. ఇటీవల విశాఖలో జరిగిన ప్రాంతీయ పెట్టుబడిదారుల సదస్సులో పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయాలంటే షెడ్యూలు ప్రాంతంగా ఉన్న అల్లూరి జిల్లాలో భూబదలాయింపు చట్టాన్ని సవరించాలంటూ అధికారులకు సూచించడం దారుణమన్నారు. 1/70 చట్టాన్ని సవరించేలా వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగాన్ని ధిక్కరించడమేనన్నారు.

ప్రజల కోసం కూటమి ప్రభుత్వం చేసేదేమి లేకపోవడంతో గిరిజన హక్కులు, చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నడం దారుణమన్నారు. గిరిజన చట్టాలను సవరించాలనే యోచనను విరమించుకోవాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహం తప్పదన్నారు. వైస్ ఎంపీపీలు శారద, వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం

ముంచంగిపుట్టు: ఇటీవల విశాఖలో నిర్వహించిన అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కమిటీలో కార్యనిర్వహణ కార్యదర్శిగా సమరెడ్డి బాలగంగాధర్ తిలక్ ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం సుజనకోటలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నేతలు, ఉద్యోగులు, గ్రామస్తులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని, గ్రామానికి మరింత పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు. సర్పంచ్ రమేష్, గ్రామ పెద్దలు శంకర్‌రావు, నీలకంఠం, ధర్మారావు, నానిబాబు, దామోదరం, మధన్, సదానందం తదితరులు పాల్గొన్నారు.



బాలగంగాధర్ తిలక్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ రమేష్, గ్రామస్తులు

గ్రామాల్లో అభివృద్ధి పనులకు చర్యలు

అడ్డతీగల: మండలంలోని వేటమామిడి పవర్ ప్రాజెక్ట్ ద్వారా కేటాయించిన నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తామని ఎంపీడీవో కె.ఆర్.విజయ అన్నారు.వేటమామిడి సచివాలయంలో ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, తహసీల్దార్ కొమరం సూర్యారావుతో కలిసి ఆమె బుధవారం గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజయ మాట్లాడుతూ ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు గ్రామసభ ఏర్పాటు చేశామన్నారు. సుమారు రూ.20లక్షల నిధులతో ప్రజాభిప్రాయం మేరకు గ్రామాల్లో పనులు చేపడతామన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో సామాజిక భవనం నిర్మాణం, పణుకురాతిపాలెంలోని కమ్యూనిటీ భవనంలో సదుపాయాలు తదితర పనుల కోసం ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్తామన్నారు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో విజయ

గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు



జి.మాడుగులలో మేకలకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది



పనసలపాడులో మేకపిల్లకు టీకా వేస్తున్న రాజేష్‌కుమార్

పాడేరు రూరల్(జి.మాడుగుల): పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ నరసింహులు తెలిపారు. జి.మాడుగుల మండలంలోని గడుతూరు, గెమ్మెలి పంచాయతీల్లో బుధవారం పశువైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడుతూరులో -135 పశువులకు, 27-మేకలకు, గెమ్మెలిలో-80 పశువులకు, 40-మేకలకు నట్టల నివారణ మందు అందజేసినట్టు చెప్పారు. పశువులకు సోకే వ్యాధులపై అవగాహన కల్పించారు. పశువైద్యాధికారులు సృజనకుమారి, ప్రియదర్శిని, సిబ్బంది కృష్ణకుమార్, కొండబాబు, వెంకట్, రఘునాథ్, సుబ్రహ్మణ్యం, మూర్తి పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: గసభ పంచాయతీ పరిధిలోని లోగిలో బుధవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ సునీత మాట్లాడుతూ గిరిజన రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ సర్పంచ్ సురేష్‌కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ సంజీవరావు, అప్పారావు పాల్గొన్నారు.

కొయ్యూరు: పశు వైద్యాధికారులు కె.రాజేష్ కుమార్, దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పనసలపాడు, ఎం.మాకవరం, కొండగోకిరి, కినపర్తి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పశు వైద్య శిబిరాల్లో 76 పశువులకు చికిత్స అందించారు. 194 పశువులకు, 189 మేకలకు నట్టల నివారణ టీకాలు వేశారు. సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహాలు



సర్వేలో పాల్గొన్న సర్పంచ్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి: పీఎం ఆవాస్ యోజన పథకం -2.0లో అర్హులైన గిరిజనులందరికీ పక్కా ఇళ్లు నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, దామనాపల్లి పంచాయతీ సర్పంచ్ కుందరి రామకృష్ణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బుధవారం పంచాయతీలోని పలు గ్రామాల్లో ఆయన గృహ నిర్మాణ శాఖ సచివాలయ సిబ్బందితో కలసి సర్వేలో పాల్గొన్నారు. అర్హులైన వారంతా ఈ పథకం ద్వారా ఇళ్లు పొందేందుకు వీలుగా అవసరమైన చర్యలు చేపడుతున్నామని రామకృష్ణ చెప్పారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ చిట్టి పడాల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ యుగంధర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగరాజు, వార్డు సభ్యులు సాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటిరియల్‌ను పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆదివాసీ విద్యా ఫౌండేషన్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు కానిస్టేబుల్(జీడీ) పరీక్షల స్టడీ మెటీరియల్‌ను నిరుద్యోగ యువతకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రామకృష్ణ, ఫౌండేషన్ ప్రతినిధులు రామకృష్ణ, బాబురావు, రవి కుమార్‌లు 80 మందికి అందజేశారు. వారు మాట్లాడుతూ ఉచిత శిక్షణను ఆదివాసీ యువత అంతా సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యతులో నిర్వహించే పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని, స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకోవాలని కోరారు. శిక్షణ పర్యవేక్షకుడు రామారావు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు



మైదానంలో నిల్వ ఉన్న మురుగునీటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీసాయి హర్ష

ముంచంగిపుట్టు: స్థానిక హోలీ క్రీడా మైదానంలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఎం.శ్రీసాయిహర్ష అన్నారు. మండల కేంద్రంలోని హోలీ క్రీడా మైదానంలో మురుగునీరు నిల్వ, పేరుకుపోయిన చెత్త వల్ల కలిగే ఇబ్బందులపై క్రీడాకారులు, స్థానికులు ఎంపీడీవో దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీనిపై ఎంపీడీవో సాయిహర్ష స్పందించి మైదానాన్ని బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-2 నుంచి మైదానంలో మురుగునీరు వస్తున్నట్టు గుర్తించారు. పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడారు. మురుగునీరు మైదానంలో రాకుండా చర్యలు తీసుకోవాలని ఫోన్‌లో ఏటీడబ్ల్యూవో స్వర్ణలతకు ఆదేశించారు. పారిశుధ్యం మెరుగుపరుస్తామని, రానున్న రోజుల్లో ఈ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని క్రీడాకారులకు ఎంపీడీవో చెప్పారు.

బాధితులకు న్యాయం చేయాలి

డుంబ్రిగుడ: ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణానికి భూములు ఇచ్చిన బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ గత ఏడు రోజులుగా చేస్తున్న దీక్షకు మద్దతుగా బుధవారం బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణం ప్రాంగణంలో బాధితులు చేపడుతున్న దీక్షలో కాఫీ బోర్డు సభ్యుడు విశ్వనాథం, మండల పార్టీ కార్యదర్శి కామేశ్వరరావు బాధితులతో కలిసి ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఉపాధి కల్పిస్తారనే భరోసాతో గిరిజన రైతులు తమ భూములు ఇచ్చారని, ఉద్యోగాలు కల్పించకుండా అధికారులు మోసం చేయడం తగదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేసి ఉపాధి కల్పించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ రాందాసు, బాధితులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు సర్వే



అంబేడ్కర్ కూడలిలో రోడ్డు విస్తరణ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ రంగారావు, సిబ్బంది

పెదబయలు: మండల కేంద్రంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్డు విస్తరణకు అడ్డంకులు తొలగిస్తున్నట్టు తహసీల్దార్ గండేరు రంగారావు అన్నారు. ఈ మేరకు మండలం కేంద్రంలోని జీసీసీ పెట్రోల్ బంకు నుంచి స్టేట్ బ్యాంకు వరకు ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా ఇరువైపులా 50 అడుగుల వెడల్పునకు మార్కింగ్ పనులను బుధవారం చేపట్టామని ఆయన చెప్పారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలువురు దుకాణదారులకు ఇప్పటికే నోటీసులు అందజేశామని, వారు స్వచ్ఛందంగా షాపులను తొలగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న 24 అడుగుల రహదారిపై దుకాణాల ఏర్పాటుతో పాటు ప్రతి సోమవారం రహదారిపైనే సంత నిర్వహణతో అత్యవసర వేళల్లో 108 వాహనాలకు దారి ఇవ్వలేని పరిస్థితులు ఏర్పడిందన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు వ్యాపారులు సహకరించాలని కోరారు. టీటీ వెంకటరమణ, ఆర్‌ఐ పూర్ణయ్య, సర్వేయర్ కృష్ణమూర్తి, వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఏవో శ్రీనివాస్

పెదబయలు: మండలంలోని అరడకోట పంచాయతీలోని పురుగుడిపుట్టు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించినట్టు మండల వ్యవసాయ అధికారి ఏ.శ్రీనివాస్ చెప్పారు. గ్రామంలో పీఎం కిసాన్ పథకానికి గాను 60 మంది రైతులకు ఈకేవైసీ నమోదు చేసినట్టు తెలిపారు. చిరుధాన్యాల సాగుపై ఆసక్తి గల రైతుల వివరాలను సేకరించామన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమాపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. గ్రామ ఉద్యానవన సహాయకులు జానకిరామ్, వార్డు సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

116 మందికి వైద్య పరీక్షలు



మోహనాపురంలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారి భావన

గంగవరం: మండలంలోని మోహనాపురంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని గంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఓ.భావన ప్రారంభించారు. వనవాసి కళ్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 116 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వనవాసి కళ్యాణ ఆశ్రమం జిల్లా అధ్యక్షుడు బొగ్గుల కాటంరెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా గిరిజన గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గిరిజనులు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యాధికారి డాక్టర్ భావన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. వనవాసి కళ్యాణ ఆశ్రమం సేవలను కొనియాడారు. సర్పంచ్ బొగ్గుల అబ్బాయి రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఎం.వెంకటరెడ్డి, హెల్త్ కమిటీ సభ్యులు బి.రాంబాబు, ఎస్.కన్నయ్య, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.